క్లుప్తంగా

సెప్టెంబర్ 15 వరకూ దూరవిద్య అడ్మిషన్లు


డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్

కె.కోటపాడు : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్య విభాగం) ద్వారా పది, ఇంటర్‌లో అడ్మిషన్లు పొందే వారు సెప్టెంబర్ 15 తేదీ వరకూ అడ్మిషన్‌లను పొంద వచ్చునని అయ్యన్న విద్యా సంస్థల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిం తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో పాటు ఫీజును చెల్లించి అడ్మిషన్‌లు పొందాలని తెలిపారు. పదో తరగతిలో చేరేందుకు 14 ఏళ్ల వయస్సు గల వారు అర్హులని తెలిపారు. చదవడం, రాయడంతో పాటు పదో తరగతి మధ్యలో మానేసిన వారు, ఫెయిల్ అయిన వారు పదో తరగతిలో చేరేందుకు అర్హులన్నారు. అలాగే ఇంటర్‌లో చేరేవారికి 15 ఏళ్లు ఉండాలని, ఇంటర్ ఫెయిల్ అయిన వారితో పాటు మధ్యలో చదువు మానేసిన వారు చేర వచ్చునన్నారు. ఇంటర్‌లో చేరి ఐదు సబెక్టులలో సింగిల్ సిట్టింగ్ ద్వారా కోర్సు పూర్తి చేయవచ్చునని ఆయన తెలిపారు. స్టడీ సెంటర్ పని వేళల్లో నేరుగా అభ్యర్థులు వచ్చి అడ్మిషన్‌ను పొందవచ్చునని సూచించారు.

జ్వరాల నియంత్రణకు చర్యలు


జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీరజ్యోతి

నర్సీపట్నం : మారిన వాతావరణ పరిస్థితులు, భారీ వర్షాల కారణంగా పట్టణాలు, గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీరజ్యోతి సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, లేదంటే దోమలు విజృంభించి మలేరియా జ్వరాల బారినపడే ప్రమాదం ఉందన్నారు. వైరల్ జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారని, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నామన్నారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా నీళ్లు, మజ్జిగ, పండ్ల రసాలు, నిమ్మరసం వంటివి తరచూ తీసుకోవాలని సూచించారు. జ్వరం తీవ్రంగా ఉంటే తక్షణం సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోని మందులు వాడాలన్నారు. జ్వరాలున్న చోట శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

బూస్టర్ డోస్ ఎరువులు వాడుకోవాలి


వీజేపురంలో నీట మునిగిన పంటపొలాలు పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త సౌజన్య

మాడుగుల: నీట మునిగిన వరి చేలులో వీలైనంత వరకు నీటిని తొలగించి బ్లూస్టర్ డోస్ ఎరువులైన యూరియా 20 కిలోలు, పొటాస్, 10 కిలోలు మిశమాన్ని ఎకరాకు వేసుకోవాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం, సైంటిస్ట్ ఎ.సౌజన్య తెలిపారు. మంగళవారం మండలంలో వీజేపురం, వొమ్మలి గ్రామాల పంట పొలాల్లో తిరిగి వరద ముంపునకు గురైన పొలాలు పరిశీలించారు. రైతులకు సూచనలు అందజేసారు. కార్యక్రమంలో మరో సైంటిస్ట్ ఎస్.సత్తిబాబు, వ్యవసాయాధికారి అనసూయ, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన పెద్దేరు జలాశయం నీటి మట్టం

మాడుగుల : మండలంలో అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయం నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. జలాశయంలోకి 900 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరేది. ప్రస్తుతం మంగళవారం ఉదయం నుంచి 400 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. 400 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. వర్షాల కారణంగా ప్రధాన పంట కాలువలకు సాగు నీరు నిలుపుదల చేశారు.

దిగుబడి బాగున్నా.. ఆదాయం లేదన్నా..


విత్తనాలకు వేరు చేసిన పండిన ఆగాకర


ఆగాకర కాయలు బస్తాల్లో నింపుతున్న రైతులు


విస్తారంగా సాగు చేస్తున్న పందిరిపై ఆగాకర పంట

- ఆగాకర రైతుకు గిట్టుబాటు కాని ధరలు
- సిండికేట్‌గా మారిన ప్రైవేటు వ్యాపారులు
- తక్కువ ధరకు కొనుగోళ్లు
- మార్కెట్లో అధిక ధరలకు విక్రయాలు

నాతవరం : ఈ ఏడాది ఆగాకరకాయలు విస్తారంగా సాగు చేశారు. మండలంలో మాధవగనగరం, తాండవ, ఉటమల్ల, తాళ్లపాలెం, వల్సంపేట, గంటావారి కొత్తగూడెం, చమ్మచింత, పొట్టినాగన్నదొరపాలెం, నాతవరం తదితర గ్రామాల్లో రైతులు సుమారుగా 300 ఎకరాలకుపైగా ఆగాకర తోటలు పందిరిపై సాగు చేస్తున్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే ఆగాకర తోటలు ద్వారా ఆదాయం బాగుండడంతో రైతులు ఆసక్తి చూపారు. ప్రైవేటు వ్యాపారులు మొదట్లో రైతు వద్ద జూన్‌లో కిలో రూ.180 చొప్పున కొనుగోలు చేశారు. తరువాత వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి రేటు తగ్గించేశారు. దిగుబడి ముమ్మరంగా పెరిగిన సమయంలో ఒకేసారి రైతు వద్ద కిలో రేటు రూ.60లకు తగ్గించేశారు. దీంతో రైతులంతా లబోదిబోమంటున్నారు. మార్కెట్లో అధిక ధరలు పలుకుతున్న సమయంలో రైతులకు గిట్టుబాటు లేకుండా దళారులు ఒకేసారి కిలో రేటు రూ. 60 తగ్గించేశారు. ఎంతో కష్టపడి పండించిన పంటకు ఆశించిన ధర రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది దిగుబడి బాగున్నా ఆదాయం రాకపోవడంతో ఉసూరుమంటున్నారు. ఇక్కడ రైతుల నుంచి కొనుగోలు చేసిన ఆగాకర కాయలు లారీలపై పట్టణ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. వ్యాపారులు తాము తెచ్చిన కాటాలతో తూకం వేసి కొనుగోళ్లు జరుపుతున్నారు. దీంతో తూకంలో కూడా మోసపోతున్నామని రైతులు చెబుతున్నారు. దీనిని ప్రశ్నించిన రైతుల వద్ద పంట కొనుగోలు చేయకుండా వివక్ష చూపిస్తున్నారు. దీంతో మరోమార్గం లేక వచ్చిన ధరలకే రైతులు పంటను తెగనమ్ముకుంటున్నారు.

ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి...

ఆగాకర సాధారంగా ఏప్రిల్‌లో సాగు చేస్తారు. మొక్కలు పెరిగే సమయంలో పంట పొలాల్లో ఐరన్ ఊసలతో పందిరి ఏర్పాటు చేస్తారు. ఆగాకర పంటకు పందిరి ఏర్పాటుకు కాయలు కోసేందుకు ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుందంటున్నారు. ఈ ఏడాది పంట ప్రారంభ సమయంలో రేటు పెంచి బాగా దిగుబడి వచ్చిన ఈ సమయంలో ధర తగ్గిస్తే మేం ఎలా బతకాలంటూ రైతులు వాపోతున్నారు.

కానరాని ప్రభుత్వ ప్రోత్సాహం

పందిరిపై కాయకూరలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రుణ సదుపాయం కల్పిస్తుందని ప్రచారం చేసేవారు. ఈ ప్రాంతంలో ఆగాకర తోటలు సాగు చేసే ఏ రైతుకు ఏలాంటి సాయం అందించలేదని రైతులకు సలహాలు ఇచ్చే అధికారుల జాడ కన్పించలేదని రైతులు ఆరోపిస్తున్నారు.


కొనుగోలు చేసి రవాణాకు సిద్ధం చేస్తున్న కాయలు

ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు రైతులు పండించిన పంటకు మార్కెట్ సదుపాయం కల్పిస్తే దళారులు బెడద తగ్గుతుందంటున్నారు. ఇటీవల ఈ గ్రామాలు మీదుగా తాండవ రిజర్వాయరు నీరు విడుదలకు స్పీకరు అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి అనిత విచ్చేసినపుడు ఆగాకర రైతులంతా కలిసి తమ సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించినా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడంతో ఫలితం లేకపోయింది.

అమ్ముకునే దారి లేదు...



కష్టపడి పండించిన పంట గిట్టుబాటు ధరకు అమ్ముకునే దారి లేక చాలా బాధపడుతున్నాం. ప్రైవేటు వ్యాపారులు అడిగిన రేటుకు అమ్ముతున్నాం. మొదట్లో కిలో రూ.180 వద్ద కొనుగోలు చేశారు. బయట మార్కెట్లో అధిక ధరలు ఉన్నా మాకు కేవలం రూ.60 ధర ఇస్తున్నారు. మరోమార్గం లేక దక్కిన రేటుకే అమ్ముకుంటున్నాం. పెట్టుబడిని బట్టి వాతావరణ పరిస్థితులను బట్టి దిగుబడులు వస్తాయి. కిలోం రేటు రూ.100 తగ్గకుండా ఉంటే రైతు కష్టానికి ఫలితం ఉంటుంది.

– రెడ్డి వరహాలు, గంటావారి కొత్తగూడెం గ్రామం

నీటి ముంపు నుంచి తేరుకుంటున్న పంటలు


ఎ.భీమవరంలో నీటి ముంపు తగ్గడంతో తేరుకుంటున్న వరినాట్లు వేసిన పొలాలు

కె.కోటపాడు : రెండు రోజులుగా కురిసిన వర్షాలు మంగళవారం నాటికి తగ్గుముఖం పట్టాయి. పెద్ద ఎత్తున వర్షపాతం నమోదు కావడం వల్ల మండలంలో పల్లపు ప్రాంత గ్రామాలైన మేడిచర్ల, రొంగలినాయుడుపాలెం, ఎ.భీమవరం, మల్లంపాలెం, కె.జె.పురం గ్రామాల్లో వేసిన వరినాట్లు పూర్తిగా వర్షపునీటితో మునిగాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆయా గ్రామాల్లో గల రైతులు వరినాట్లు పూర్తయిన పోలాల్లోకి చేరిన వర్షపునీటిని తొలగించే చర్యలను చేపట్టారు. నీట మునిగిన వరిపంట తేరుకోవడంతో పాటు వ్యవసాయశాఖ సిబ్బంది ఇచ్చే సూచనలు పాటిస్తున్నారు.

41 హెక్టార్లలో నీట మునిగిన వరి పంట

చీడికాడ : మండలంలోని పలు పంచాయతీల్లో అల్పపీడన ప్రభావంతో నీట మునిగిన వరి పంటను ఏవో కృష్ణవేణి మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో గడిచిన మూడు రోజులుగా మండలంలోని అర్జునగిరి, జైతవరం, శిరిజాం, చీడికాడ, తురువోలు, తంగుడుబిల్లి గ్రామాల్లో 41 హెక్టార్లు వరిపంట నీట మునిగినట్టు గుర్తించామన్నారు. మడిలో నీటిని చిన్నచిన్న కాలువల ద్వారా బయటకు పంపించేలా చూడాలన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాటలతో విద్య

జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ సూర్యలక్ష్మి


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న పీడీ సూర్యలక్ష్మి

కె.కోటపాడు : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని అనకాపల్లి జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ సూర్యలక్ష్మి అన్నారు. మండలంలో గొండుపాలెం–2, రామచంద్రపురం అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. కేంద్రాలకు వచ్చిన చిన్నారులతో పాటు రిజిష్టర్‌లలో నమోదు చేసిన హాజరును పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు సకాలంలో పౌష్టికాహారం పంపిణీ చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కేంద్రాల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని కె.కోటపాడు ఐసీడీఎస్ పీవో లలితకుమారికి తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ఆర్డీవో కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయు నాయకులు, వాచ్‌మన్లు

నర్సీపట్నం : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న వాచ్‌మన్లకు ఆరు నెలల నుంచి పెండింగ్ ఉన్న వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సీఐటీయు నాయకులు ఈరెల్లి చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయు ఆధ్వర్యంలో నైట్ వాచ్‌మన్లు మంగళవారం ఆర్డీవో కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. వేతనాలు చెల్లించకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రభుత్వాన్ని నిలదీసారు. చాలి చాలని వేతనాలను సైతం సక్రమంగా ఇవ్వకపోవడం దారుణమన్నారు. కనీస వేతనం రూ.16 వేలు ఇవ్వాలన్నారు. వాచ్‌మన్లకు యూనిఫాం, టార్చ్‌లైట్, గుర్తింపు కార్డులు, బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వాచ్‌మన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హేమాలయ, కార్యదర్శి సత్తిబాబు, వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు


చొడువాడలో ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

కె.కోటపాడు : గర్భిణులు ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నిర్వహించుకోవడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యం క్షేమదాయకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి హైమావతి తెలిపారు. మండలంలో చొడువాడ, లంకవానిపాలెం పీహెచ్‌సీలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భాగా ఆసుపత్రులకు ప్రతి రోజూ వస్తున్న వ్యాధిగ్రస్తుల వివరాలతో పాటు వారి నమోదును ఆన్‌లైన్‌లో చేపట్టాలని వైద్య సిబ్బందికి ఆమె తెలిపారు. వ్యాధిగ్రస్తులకు ఆసుపత్రులకు వచ్చే సమయంలో వారి వెంట ఆధార్‌కార్డును తీసుకురావాల్సిందిగా ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంల ద్వారా ప్రజల్లో అవగాహనను కల్పించాలని హైమావతి తెలిపారు. గ్రామాల్లో తప్పకుండా సంచార చికిత్సలను నిర్వహించాలని, 0–5 ఏళ్ల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలను వేయలేని చిన్నారులను గుర్తించి వారికి తప్పకుండా వేయాలని ఆమె తెలిపారు. ప్రధానమంత్రి వయోవందన లబ్ధిదారులను ఆన్‌లైన్‌లో 100శాతం రిజిస్ట్రేషన్ పూర్తి చేయాల్సిందిగా చొడువాడ, లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులకు వివరించారు. ఆసుపత్రుల్లో ఇంకా అవసరమైన మౌలిక వసతుల కల్పనకు వైద్యాధికారులను అడిగి ఆమె తెలుసుకున్నారు. చొడువాడ, లంకవానిపాలెం పీహెచ్‌సీల వైద్యాధికారులు శైలజ, మాదంనాయుడు, చైతన్య, శశిప్రియాంక, ఎంపీహెచ్‌ఈవో శంకరరావు, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ పాల్గొన్నారు.

సాగు వివరాల నమోదు తప్పనిసరి

మాకవరపాలెం : సాగు వివరాలను ఈ పంట పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏవో అప్పారావు రైతులకు సూచించారు. మండలంలోని శెట్టిపాలెం, రాచపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలు నష్టపోతే పరిహారం అందాలన్నా, ప్రభుత్వ పథకాలు అందాలన్నా రైతులు సాగు చేసే పంటల వివరాలను ఈ పంట పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. వరిసాగులో తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. అవసరం మేరకే యూరియా, పురుగు మందులను వినియోగించాలన్నారు. పంటలసాగులో సూచనలు, సలహాలకు రైతుల సేవా కేంద్రాల ఇన్‌చార్జిలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు నాయుడు, ఏఈవో శేషునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

49 దివ్యాంగ పింఛన్లు రద్దు


ఎంపీడీవో సీతారామస్వామి

రావికమతం : మండలంలో 49 మందికి దివ్యాంగ పింఛన్లు రద్దు చేసినట్టు మండల ఎంపీడీవో సీతారామస్వామి మంగళవారం తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వివిధ కారణాలతో పింఛన్లు రద్దు చేస్తున్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగా దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారికి నోటీసులు ఇచ్చి అంగ వైకల్యం నిర్ధారణ కొరకు ప్రభుత్వ ఆస్పత్రికి పంపించి అంగవైకల్యం నిర్ధారణ, సర్టిఫికెట్లు తనిఖీ నిర్వహించారు. సదరం సర్టిఫికెట్‌లో 40 శాతం కన్నా తక్కువ వైకల్యం ఉన్న 49 మందికి పింఛన్లు రద్దు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, అలాగే 20 మందికి దివ్యాంగ పింఛన్ల నుంచి వృద్ధాప్య పింఛనుగా మార్పు చేశారని, మరో ముగ్గురికి తాత్కాలిక వైకల్యంగా నిర్ధారించారని తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే తనకు ఫిర్యాదు చేయాలని కోరారు.

బస్టాండ్‌లో గోతులు పూడ్చాలి


పంచాయతీ కార్యదర్శి నాయుడుకు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మీనారాయణ

మాడుగుల: స్థానిక పాత బస్టాండ్‌లో గోతులు పూడ్చాలంటూ టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మంగళవారం పంచాయతీ కార్యదర్శినాయుడుకు ఫిర్యాదు చేశారు. తాత్కాలికంగా పంచాయతీ నిధులతో గోతులు పూడ్చాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఢిల్లీ నానాజీ, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదపూడిలో ఆరోగ్య సేవలపై ఆకస్మిక తనిఖీ


పెదపూడిలో వైద్య సిబ్బంది సేవలను అడిగి తెలుసుకుంటున్న గణాంక అధికారి రామచంద్రరావు


రోగులకు రక్త పరీక్షలు

బుచ్చెయ్యపేట : మండలంలో పెదపూడి గ్రామంలో గల ప్రజలకు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ద్వారా అందుతున్న వైద్య సేవలను మంగళవారం అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు పరిశీలించారు. పెదపూడిలో గల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంను వీరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గణాంక అధికారి రామచంద్రరావు, డీపీవో జగదీష్ రికార్డులలో నమోదు చేసిన వివరాల ప్రకారం గర్భిణులు, బాలింతలు, కౌమార దశ బాలికల ఇళ్లకు వెళ్లి వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రికార్డులు ఆన్‌లైన్‌లో రిపోర్ట్ చేయడాన్ని పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు పడడం వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని రామచంద్రరావు వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో తురకలపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్యారాణి, ఎంపీహెచ్ఈవో రాజశేఖర్, హెచ్‌వీ రవణమ్మ పాల్గొన్నారు.

నీటి ముంపులోనే వరిచేలు


జంపెనలో నీటి మునిగిన వరి నాట్లలో చేపల వేట సాగిస్తున్న దృశ్యం


మాడుగుల మండలం జంపెన పంట పొలాలు నీట ముంపునకు గురైన దృశ్యం

మాడుగుల: మండలంలో జంపెన గ్రామానికి చెందిన సుమారు 12 ఎకరాల్లో వారం రోజుల కిందట వరినాట్లు వేశారు. మూడు రోజులు నుండి కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు నీట ముంపులో ఉండిపోయాయి. సత్యవరం, ఎం.కోడూరు సాగరం, గాదిరాయి, జేడీపేట, కింతలి గ్రామాలుకు చెందిన సుమారు మరో 20 ఎకరాల్లో వరి నాట్లు నీట ముంపులో ఉండిపోవడంతో నాట్లు కుళ్లిపోతాయని, రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి పంటలుకు కలసి రాలేదని, ప్రభుత్వమే ఆదుకోవాల


ముకుందపురంలో నీటి ముంపులో పంట పొలాలు

మాడుగుల రూరల్ : మండలంలో ముకుందపురం, కె.జె.పురం, తదితర గ్రామాలల్లో ఇటీవల వేసిన వరి పంట నీటి ముంపునకు గురైంది. వర్షాలు తగ్గాక మంగళవారం కూడా పంట పొలాలు ముంపులోనే ఉన్నాయి. ముంపు నష్టాన్ని అంచనా వేసి, నష్టపరిహారం అందజేయాలని ముకుందపురం సర్పంచ్ కర్రి గణేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఒంగోలులో 23 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు


కె.కోటపాడులో రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కాసుబాబు

కె.కోటపాడు : ఈ నెల 23 నుంచి 25 వరకూ సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరగనున్నట్లు ఆ పార్టీ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు తెలిపారు. కె.కోటపాడులో మంగళవారం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్రంలో గల బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు తప్ప రాష్ట్ర ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల ప్రభుత్వ సహాయం ఇవ్వాలని కాసుబాబు కోరారు. మహాసభల చివరిరోజు అయిన 25న భారీ బహిరంగ సభ జరగనున్నట్టు తెలిపారు.పెద్ద ఎత్తున సీపీఐ నాయకులు, పార్టీ అభిమానులు, మద్దతుదారులు సభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జి.దేముడుబాబు, పొంతపల్లి రామారావు, రెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

రావికమతం : దొంగతనాలు నివారణకు ప్రధాన కూడలిలో, దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపారు. రావికమతం, మేడివాడ గ్రామాల్లో దుకాణదారులు, గ్రామ పెద్దలతో మంగళవారం ఆయన మాట్లాడారు. గ్రామ ప్రధాన కూడలిలో పంచాయతీ వారి సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే దుకాణదారులు తప్పనిసరిగా తమ దుకాణాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తూ నోటీసులు అందజేశారు.

చెరువు ఆక్రమణపై క్షేత్రస్థాయి పరిశీలన


చెరువు హద్దులు గుర్తించిన అధికారులు

రావికమతం : మండలంలో గుడ్డిప చెరువు ఆక్రమణకు గురయిందని గ్రామానికి చెందిన గుమ్మాల అప్పలనాయుడు అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ చెరువు సమస్య పరిష్కరించాలన్న కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఆదేశాల మేరకు తహసీల్దార్ అంబేద్కర్ మంగళవారం ఎం.ఆర్.ఐ రమణ, సర్వేయర్ శ్రీనివాస్‌తో కలసి చింతలబంద చెరువును పరిశీలించారు. సరిహద్దులు గుర్తించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమణలు తొలగించడానికి శాంతి భద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అందుకు ఇరిగేషన్ అధికారులు, పోలీసు అధికారులు కూడా ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు పంపినట్టు తహసీల్దార్ విలేకరులకు తెలిపారు.

మళ్లీ జోరుగా పొలం పనులు


పొలంలో దమ్ము పడుతున్న రైతులు


వరి నాట్లు వేస్తున్న కూలీలు


ఆకుమడిలో ఆకు తీస్తున్న కూలీలు

చోడవరం : ఖరీఫ్ వరి సాగుకు తుఫాను వర్షాలు చాలా మేలు చేశాయి. పూర్తిస్థాయిలో దమ్ములు పట్టేందుకు కావలసినంత నీరు ఈ నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పొలాలన్నీ నిండిపోయాయి. మెట్ట ప్రాంతాల్లో వాన కోసం రైతులు ఎదురుచూస్తుండగా వానదేముడు కురుణించడంతో రైతులంతా పొలంపనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నాట్లు వేసే సమయంలో సరైన వర్షం కురవక ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో దమ్ములు పట్టలేదు. తొలకరికి ముందు ఓ మోస్తరు వర్షం కురిసినా అది నారుమడులు సిద్ధమవ్వడానికి ఉపయోగపడింది. జలాశయాల కాలువల కింద, వ్యవసాయ బోర్లు కింద తప్ప మిగతా మెరక ప్రాంతాల్లో వరి నాట్లు ఇప్పటివరకూ పూర్తిస్థాయిలో వేయలేదు. నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా తుఫాను ప్రభావంతో రోజూ కనీసం 30 నుంచి 50 మిల్లీమీటర్లు వరకూ వర్షం కురవడంతో పొలాలన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. మూడురోజుల క్రితం దుక్కుకి పైగా వాన కురవడంతో రైతులు తబ్బిబ్బయ్యారు. మెట్ట,పల్లం, ఆయకట్టు భూమి అని తేడా లేకుండా అన్ని పొలాల్లోను దమ్ము పట్టేందుకు కావలసినంత నీరు నిలిచి ఉండడంతో ఒక పక్క దమ్ములు పడుతూనే మరో పక్క ఉడుపు చేస్తున్నారు. రైతు లంతా ఒకే సారి నాట్లు వేయడంతో కూలీలకు, యంత్రాలు, ట్రాక్టర్లకు మంచి డిమాండ్ వచ్చింది. వరి దమ్ములు, నాట్లు జోరందుకోవడంతో ఇప్పటికే అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు కూడా అందుబాటులో ఉంచారు. వరి నాట్లు వేసే రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని చోడవరం వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు రవీంద్రనాథ్ అన్నారు. నాట్లు వేసేటప్పుడు దమ్ములో ఎకరానికి డీఏపీ ఒక కట్ట, పొటాస్ 20 కేజీలు కలిపి వేయాలని, లేకపోతే ఎస్ఎస్‌పి 200 కేజీల్లో అరకట్ట సూపర్‌పాస్ఫేట్, పొటాస్ 20 కిలోలు కలిపి దమ్ములో వేయాలని తెలిపారు. ఉడిచేటప్పుడు నీరు ఎక్కువగా లేకుండా అడుగునీరు మాత్రమే ఉండేలా చూసుకోవాలని, ఉడిచిన తర్వాత 2 అంగుళాల మేర నీరుపెట్టాలని ఏడీ సూచించారు.

రోలుగుంట: వర్షాలు తగ్గడంతో ఖరీఫ్ సాగు పనులు మళ్లీ ఊపందుకున్నాయి. శరభవరం, బుచ్చింపేట, కంచగుమల, కొమరవోలు తదితర గ్రామాల్లో ఇప్పటికే దమ్ములు పూర్తి చేసేకొని నాట్లు ప్రారంభమయ్యాయి. రెండు రోజులుగా రోలుగుంట, కొండపాలెం, వెలంకాయలపాలెంలో దమ్ముల పనులు చేసుకుంటున్నారు. భోగాపురం, కొంతలం, జె.నాయుడుపాలెం తదితర గ్రామాల్లో ఆకుమడులో ఆకుతీసి, నాట్లు వేసుకుంటున్నారు. మహిళా కూలీలకు , దమ్ము ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది.

మెట్ట భూముల్లో ముమ్మరంగా వరి దమ్ములు


వర్షాలు కురవడంతో కె.జె.పురంలో వరి దమ్ములు చేసిన పంట భూమి

మాడుగుల రూరల్ : కరువుతీరా కురిసిన వర్షాలకు మెట్ట భూముల్లో వరి పంట వేసే పనిలో రైతులు నిమగ్నులై ఉన్నారు. ఇప్పటి వరకు పల్లపు భూముల్లో వరి నాట్లు పూర్తి కావడంతో, ఇక మెట్ట భూముల్లో వరినారు ఎండిపోవడంతో, కురిసిన వర్షాలకు వరినాట్లు ప్రారంభం అయ్యాయి. ఈ దశలో మంగళవారం వాతావరణం అనుకూలించడంతో వరి దమ్ములు చేస్తున్నారు. మరో వారం రోజులల్లో వరినాట్లు పూర్తి కావస్తున్నాయి.